క్లుప్తంగా

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారుల స్వచ్ఛభారత్



నరసరావుపేట: కలెక్టరేట్ సమీపంలోని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌డీసీ ట్రైనింగ్ సెంటర్ల ముందు అధికారులు, ఉద్యోగులు శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. చీపుళ్లతో పరిసర ప్రాంతాలను ఊడ్చి శుభ్రం చేశారు. జీ–20 జన భగీదారి కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని, ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు వెల్లడించారు. ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ అదనపు అధికారి వీసీ హెచ్ రామాంజనేయులు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రవీంద్రనాయక్, ఎస్‌డీసీ ఇన్‌చార్జి షేక్ హజరత్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన రహదారి వివాదం



యడ్లపాడు: ఇంటి నిర్మాణ వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. పాత నివాసాన్ని తొలగించి అదేస్థానంలో కొత్త ఇంటిని నిర్మించుకున్న నేపథ్యంలో సదరు ఇంటి పక్కగా ఎస్సీకాలనీకు వెళ్లే మార్గం మూసుకుపోయిందని వివాదం రేగింది. మండలంలోని సందెపూడి గ్రామానికి చెందిన బొప్పూడి కృష్ణమూర్తి తన పాతిల్లు పడగొట్టి కొత్తగా నిర్మాణం చేపట్టాడు. అయితే తమ కాలనీకి వెళ్లే దారి మూసుకుపోయిందని కాలనీ వాసులు కొత్త నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో కృష్ణమూర్తి యడ్లపాడు పోలీసులను ఆశ్రయించి రిజిస్టర్ డాక్యుమెంటులోనమోదైన పత్రాలను చూపించాడు. సదరు స్థలాన్ని సర్వేయరు సైతం సర్వే నిర్వహించినట్లు వారికి విన్నవించుకున్నాడు. పోలీసులు గ్రామానికి చేరుకుని వివాదం లేకుండా నిర్మాణం జరిగే చూసినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

రిలయన్స్ స్మార్ట్‌లో అగ్నిప్రమాదం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగు పాలెం రోడ్డులో ఉన్న రిలయన్స్ స్మార్ట్‌లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. బిల్డింగ్‌లోని అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 100 కేవీ జనరేటర్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఈ ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. జనరేటర్ పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, మంటలను వెంటనే అదుపులోకి తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ఈ ప్రమాదంలో రూ.3 నుంచి రూ.4 లక్షల మధ్య ఆస్తి నష్టం వాటిల్లినట్లు రిలయన్స్ ప్రతినిధులు తెలిపారు.

జగనన్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

నియోజకవర్గంలో 26 మందికి రూ.24 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు పొందిన లబ్ధిదార్లతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో వైద్య ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 26 మందికి విడుదలైన రూ.24 లక్షల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదార్లకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని జబ్బులకోసం సీఎంఆర్‌ఎఫ్ నిధి నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహాయం అందజేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విభాగాలను అభివృద్ధి చేస్తూ పేద వారికి ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు అందజేస్తున్నారన్నారు. ఈ మేరకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

క్రమబద్ధీకరణపై దృష్టిసారించిన పోలీసు విభాగం

- పదిచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు
- విధుల్లో 24 మంది పోలీసులు
- రెండురోడ్లలో వన్‌వే ట్రాఫిక్ అమలు



కూరగాయల మార్కెట్ సెంటర్‌లో పోలీసులు తీసుకున్న చర్యలతో విశాలంగా కనిపిస్తున్న రహదారి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో జఠిలంగా మారిన ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసు విభాగం దృష్టి సారించింది. జిల్లా కేంద్రమైన తర్వాత వివిధ ప్రదేశాల నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలు, ప్రజల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో పాటు వ్యక్తిగత ప్రైవేటు వాహనాలు పెరిగాయి. రోడ్లు వెడల్పుగా లేకపోవటంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయటం పోలీసులకు సవాల్‌గా మారింది. పార్కింగ్ ప్రదేశాలు లేకపోవటంతో కారుతో కుటుంబ సభ్యులు పట్టణంలోని మెయిన్ రోడ్లకు వచ్చి మార్కెట్ చేసే అవకాశం లేదు. మెయిన్‌రోడ్డు, పల్నాడురోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, గుంటూరు, వినుకొండ రోడ్లు, మల్లమ్మ సెంటర్, లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్లలో విపరీతంగా వాహనాల రాకపోకలు పెరిగాయి.

రాకపోకలు ముమ్మరం

జిల్లా ఆఫీసులు ఏర్పడుతుండటంతో వాటిలో పని చేసేందుకు వచ్చే ఉద్యోగులు, ప్రజల రాకపోకలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకోసం అరకొరగా ఉన్న సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు. ప్రైవేటు యాడ్ సంస్థల సహకారంతో పోలీసు, పురపాలక శాఖలు సంయుక్తంగా పట్టణంలో పదిచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. మల్లమ్మ సెంటర్, కోటసెంటర్, సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియంకు ఎదురుగా, గుంటూరు రోడ్డు ప్రవేశమార్గం సర్కిల్‌లో, ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా, వినుకొండ రోడ్డులోని బిలాల్‌కు ఎదురుగాను, గడియార స్తంభం సెంటర్, స్టేషన్ రోడ్డులోని ఆర్‌యూబీకి ఎదురుగా, పల్నాడురోడ్డులోని మయూరి హోటల్‌కు ఎదురుగాను, అదే రోడ్డులో రిలయన్స్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను త్వరలో ప్రజలకు సేవలు అందజేయనున్నాయి.



లాల్‌బహుదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కోన్లు



మల్లమ్మ సెంటర్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి కుడివైపున వెళ్లరాదంటూ పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డు

నూతన డీఎస్పీ రాకతో...

ఇటీవలే డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేవీ మహేష్ పోలీసు అధికారులతో కలిసి పట్టణంలోని పలు కూడళ్లలో పర్యటించి ట్రాఫిక్ తీరును పరిశీలించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. పట్టణంలో రెండు రోడ్లలో వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేస్తున్నారు. గడియారం స్తంభం సెంటర్ నుంచి వచ్చే ట్రాఫిక్ మెయిన్ రోడ్డులోని శివుని బొమ్మ ఐలాండ్ పక్కగానున్న రోడ్డులోకి ప్రవేశించి పట్టాభి రామస్వామి దేవాలయం, మహాత్మాగాంధీ షాపుల సెంటర్ మీదుగా సత్తెనపల్లి రోడ్డులోకి చేరుకోవాలి. అలాగే మల్లమ్మసెంటర్ నుంచి కూరగాయల మార్కెట్ వైపుకు వచ్చే ట్రాఫిక్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఎడమ వైపున్న సర్వీసురోడ్డులోకి ప్రవేశించి కుడివైపునున్న సర్వీసు రోడ్డు నుంచి బయటకు రావాల్సిఉంటుంది. గతంలో ఫ్లైఓవర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్ల మీదుగా రాకపోకలు సాగించే ట్రాఫిక్‌ను ఇప్పుడు ఎడమవైపునుంచి ప్రవేశించి తిరిగి కుడివైపు నుంచే వచ్చేవిధంగా వన్‌వేను అమలు చేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించటంతో పాటు, కూరగాయలు, పండ్ల వ్యాపారులను నియంత్రిస్తూ ట్రాఫిక్ కోన్లను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ సమస్య తీరింది.



మల్లమ్మ సెంటర్‌లో ప్రారంభానికి సిద్ధం చేస్తున్న నూతన సిగ్నల్స్

ట్రాఫిక్ విధుల్లో 24 మంది

ట్రాఫిక్ విధుల్లో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, 21 మంది సిబ్బందితో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ రతన్‌కుమార్ వెల్లడించారు. త్వరలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తామన్నారు. సిగ్నల్స్‌కు టైమ్ సెటింగ్ చేస్తే ఆటోమేటిక్‌గా పని చేస్తాయని, తమ సిబ్బంది కూడా అక్కడనే ఉండి ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తారన్నారు.

ఐదు నుంచి యువతకు ఉచిత శిక్షణ

నరసరావుపేట: ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం, సింక్రో సర్వీస్ గ్లోబల్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల ఐదోతేదీ సోమవారం నుంచి యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నరసరావుపేట సెంటర్ మేనేజర్ కోట్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉచిత కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్, మగ్గం వర్క్స్, టాలీ, ఇన్వర్టరీ క్లర్క్, సీసీటీవీ ఇనస్టలేషన్, మొబైల్ రిపేరింగ్, బేసిక్ కంప్యూటర్ శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణా అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు అరండల్‌పేట మోర్ సూపర్ మార్కెట్ పైన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 63018 51504 సంప్రదించాలని కోరారు.

షాహీమసీదు భూములకు కౌలు వేలం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు రెవిన్యూ పరిధిలో షాహీ మసీదు భూములకు బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లాబాషా శనివారం నిర్వహించిన వేలంలో రూ.10వేలు చొప్పున ధరావత్తు చెల్లించి ఏడుగురు హాజరయ్యారు. సర్వే నెంబరు 424, 425, 430లో 32 యకరాల భూమి ఉండగా, ఇందులో రోడ్లు, కాలువలు పోను 25 యకరాలు మాత్రమే మిగిలింది. వేలంలో పలువురు రైతులు పోటీపడ్డారు. యకరం ఏడాదికి రూ.5500ల చొప్పున హెచ్చుధరను షేక్ రోషన్ అనే రైతు స్వంతం చేసుకున్నాడు. 2023–2026 వరకూ మూడేళ్లకు గాను రూ.4,12,500ల ఆదాయం వక్ఫ్ బోర్డుకు లభించింది. హెచ్చుపాటదారు రోషన్ కొంత సొమ్ము జమచేయటంతో అధికారులు అనుమతి పత్రం అందించారు. అయితే ఈ భూములు రెండేళ్లుగా వేలం నిర్వహించకపోవటంతో పిచ్చిచెట్లు పెరిగి సాగుకు ఆటంకంగా మారింది.

13న సాతులూరు వక్ఫ్ భూములకు కౌలు వేలం

నాదెండ్ల: సాతులూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదు భూములకు ఈ నెల 13న బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ కరిముల్లా బాషా తెలిపారు. సర్వే నెం.729,731లో 84.45 ఎకరాల భూమి ఉందని, 13వ తేదిన ఉదయం 10 గంటలకు సచివాలయంలో బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నందున ఆసక్తి గల రైతులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమాలు ప్రభుత్వానికి రెండు కళ్లు

- ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- అల్లూరివారిపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



సీసీ రోడ్లు, డ్రైయిన్‌లను ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని అల్లూరివారిపాలెంలో రూ.55 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన, డ్రెయిన్‌లు, రోడ్లుకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గ్రామస్తులు అందరూ ఉపయోగించుకునే విధంగా గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, పాలకేంద్రం, బీసీ కమ్యూనిటి హాల్ వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు చూపిన చొరవను ఆయన అభినందించారు. ఎంపీ నిధులతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులతో పార్టీ పటిష్టతకు నాయకులు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామంలో రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. గడపగడప కార్యక్రమం నిధులతో రూ.20 లక్షలతో సీసీరోడ్లు, డ్రైయిన్లు ప్రారంభించామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ బీసీ కమ్యూనిటీ హాల్‌ను గ్రామంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం తుదిదశకు చేరుకుందని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైయిన్‌లు, కల్వర్ట్‌లు, కమ్యూనిటీ హాల్స్, ఖబరస్థాన్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు గ్రామంలో చేపట్టామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందనే వారికి ఈ అభివృద్ధి పనులు కనిపించవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యాంపాటి వెంకటప్పారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పీఆర్ డీఈ హరనాథ్, సర్పంచ్ భవనం నర్సిరెడ్డి, భవనం అంజిరెడ్డి, భవనం సుధాకరెడ్డి, మైలా ఆంజనేయులు, చౌడం వెంకట్రామయ్య, సుఖమంచి యల్లమంద, గందె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక



ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పీడీ జోసఫ్‌కుమార్

నాదెండ్ల: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని, గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలని గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ జోసఫ్‌కుమార్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ, ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ హాజరయ్యారు. 2020 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకూ 690 పనులకు గాను రూ.6,61,22,169లు పనులు జరిగాయి. పంట కాల్వల్లో పూడికతీత, మంచినీటి చెరువుల పూడిక, పండ్ల తోటల పెంపకం, సచివాలయ భవనాల నిర్మాణం, ఇంటర్నల్ రోడ్లు, సీసీ ఓపెన్ డ్రైనేజీ పనులు జరిగాయి. బుక్కాపురం గ్రామంలో పండ్ల తోటలకు చెందిన మొక్కలు ఎక్కువ చనిపోవటంతో వాటి స్థానంలో నూతన మొక్కలు నాటితేనే ఫీల్డ్ అసిస్టెంట్‌కు జీతం వస్తుందని తెలిపారు. గొరిజవోలు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ 50 శాతం మాత్రమే రికార్డులు పూర్తి చేశారని, పదిహేను రోజుల్లో వందశాతం రికార్డు పూర్తి చేసి అందించాలని, లేనిపక్షంలో పెనాల్టీ విధిస్తామన్నారు. ఇటీవల కాలంలో మండలంలో ఆధార్ సీడింగ్ లేకపోవటంతో 500 మందికి జాబ్‌కార్డులు తీసివేశారని, ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తనిఖీ చనిపోయిన, వలస పోయిన వారు మినహా మిగిలిన జాబ్‌కార్డులు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ 15–20 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ నెల 1 నుంచి ఆధార్ సీడింగ్ లేకుంటే వేతనం వచ్చే అవకాశం లేదన్నారు. కొన్ని గ్రామాల్లో పనిప్రదేశాల్లో సమాచార బోర్డులు లేవని మస్టర్ బుక్‌లో కొంతమందికి పనిచేసినా వేతనాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఎంతమేర అవకతవకలు జరిగాయి, వీటిపై రికవరీ ఎంతనేది తెలియరావాల్సి ఉంది. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ బుజ్జి, ఏపీవో పుష్పరాజు, నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు ఏడుకొండలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ప్రతిష్టా మహోత్సవాలు



ముండ్రువారిపాలెం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



గణపవరంలో నిర్వహించిన గ్రామోత్సవం



వినుకొండలో జరిగిన విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు



అయ్యన్నపాలెంలో జరిగిన ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

గణపవరంలో ఆధ్యాత్మిక శోభ

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భారీ వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 7న జరగనున్న నేపథ్యంలో శనివారం యాగశాలలో హోమాలు, మూలమూర్తులకు కలశములు, జీవ ధ్వజస్తంభానికి సాంప్రదాయ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీ వేద పండితుడు మాల్యంవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటల వరకూ విగ్రహాలు, ధ్వజస్తంభానికి గ్రామోత్సవం నిర్వహించారు.

ముండ్రువారిపాలెం గ్రామంలో..

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత స్వామి శిలా విగ్రహాలు జీవధ్వజ స్తంభం, బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ట వేడుకలు గ్రామస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన దేవాలయం ప్రతిష్టా వేడుకలు ఉదయం 8 గంటలకు దివి జ్యోతిర్మయి కుప్పయ్య సారథ్యంలో నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినుకొండలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మార్కాపురం సెంటర్‌లోని రావిచెట్టు వద్ద శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అభయాంజనేయ, మహాలక్ష్మి దేవి విగ్రహాలకు పంచామృత పూజ, గ్రామోత్సవం, ధాన్యాధివాసం నిర్వహించారు. గణపతి పూజ, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యన్నపాలెంలో...

బొల్లాపల్లి:మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో నీలంపాటి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామసర్పంచ్ పి.సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తి గురవయ్య, ఆళ్ల సాంబిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం ఆరవ వార్షికోత్సవాన్ని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చలువ పందిరిలో స్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

- 40 రోజులు వివిధ రంగాలపై నైపుణ్య శిక్షణ
- పలు క్రీడాపోటీల నిర్వహణ బహుమతులు ప్రదానం



శిబిరంలో నేర్చుకున్న విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

యడ్లపాడు: వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ విద్యావిభాగం ఆధ్వర్యంలో స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామానికి చెందిన వారే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మండువేసవిలో సైతం 178 మంది హాజరు కావడం విశేషం. శిబిరం ముగింపు రోజున ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, పీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు నూతలపాటి కాళిదాసు పాల్గొని మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరం ద్వారా నిష్ణాతులైన ఉపాధ్యాయులచే తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలతో పాటు గణితం సబ్జెక్టులపై తర్ఫీదు నిచ్చారన్నారని తెలిపారు. అలాగే చేతి రాత నైపుణ్యం, బొమ్మల తయారీ తదితర అంశాలపై 40 రోజుల పాటు శిక్షణతో అందుకు అవసరమైన విద్యాసామాగ్రిని ఉచితంగా పిల్లలకు అందించడం అభినందనీయం అన్నారు. అలాగే విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను పాఠశాలలకు వెళ్లాకా కూడా మననం చేసుకోవడం వలన అవి మదిలో శాశ్వతంగా గుర్తుండిపోతాయన్నారు. ఈ సందర్భంగా పదోతరగతిలో మండలంలో అత్యధిక మార్కుల్ని సాధించిన ఆకాష్ బెహరాన్ అనే విద్యార్థికి రూ.5వేల నగదు అందజేశారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిన, అలాగే శిబిరం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.గణిత ఉపాధ్యాయుడు కల్లూరి వాసు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేతా రామబ్రహ్మం, ఉపాధ్యాయులు షేక్ మీరావలి, విజయ్, నాగరాజు, రామకృష్ణ, రమాదేవి, గ్రామ పెద్దలు ముత్తవరపు సుబ్బారావు, కల్లూరి కోటేశ్వరరావు, పోపూరి హనుమంతరావు పాల్గొన్నారు.

రేపు పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5వతేదిన విద్యాశాఖ ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్ శనివారం తెలిపారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే దానిలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యంకు పరిష్కారం అనే అంశంపై వ్యాసరచన ఉంటుందని తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణ అంశంగా చిత్రలేఖనం పోటీ కూడా నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు ఏ.ఏ. మధుకుమార్ 9032871234, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి 8106276869 సంప్రదించాలని తెలిపారు.

డిప్యూటీ సర్వేయర్ సేవలు అభినందనీయం

శావల్యాపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావుకు పదోన్నతి రావటం అభినందనీయమని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి రెవెన్యూ పరంగా మెరుగైన సేవలు అందించి అందరు మన్ననలు పొందటం సంతోషకరమన్నారు. బాపట్ల జిల్లా ఏడీ కార్యాలయం సర్వేయర్‌గా పదోన్నతి నియమాకం కాగా ప్రస్తుతానికి ఈపూరు మండలం డిప్యూటేషన్‌పై తుంగా శ్రీనివాసరావు వెళుతున్నట్లు చెప్పారు. అనంతరం మండల డిప్యూటి సర్వేయర్ తుంగా శ్రీనివాసరావును పూలమాలలతో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, డిప్యూటీ సర్వే అధికారి పి.నాసరయ్య, ఆర్‌ఐ చంద్రబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రీ సర్వేలతో న్యాయం చేస్తాం

బొల్లాపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని మూగచింతలపాలెం గ్రామ సచివాలయంలో రీ సర్వేపై శనివారం తహసీల్దార్ వి.సుధాకర్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెండో విడతలో వడ్డెంగుంట రెవెన్యూ గ్రామ పరిధిలో తొలుత రీ సర్వే ప్రారంభమైందన్నారు. డ్రోన్ సర్వేలో ఓ ఆర్‌ఐ మ్యాప్స్ సేకరణ పూర్తయిందని, క్షేత్రస్థాయిలో రీసర్వే ఈ రెవెన్యూ పరిధిలో ప్రారంభించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వేలో భాగంగా మూడు బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కొక్క టీం రోజు 40 ఎకరాలు సర్వే చేయాల్సిందని తెలిపారు. రీసర్వేలో అనుభవదారుడు, భూహక్కు తదితర వివరాలు సేకరించి ప్రతి రైతుకు న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరికరాల అందజేత

చిలకలూరిపేట: పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలను ప్రోత్సహించటం అభినందనీయమని పసుమర్రు ఎస్‌ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ మొహమ్మద్ యాసిన్ చెప్పారు. పాఠశాల ప్రయోగశాలకు ఉపయోగపడే రసాయనాలు, పరికరాలను యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కల్పన దంపతులు శనివారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మాంగనీస్ క్లోరైడ్, ఫెర్రిక్ క్లోరైడ్, సోడియం నైట్రేట్, ఆల్కాహాల్ థర్మామీటర్లు వంటి అందజేయటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గద్దె హరిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పచ్చరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ

శావల్యాపురం: రానున్న ఖరీఫ్ సీజను రైతులకు అవసరమైనవన్నీ రైతుభరోసా కేంద్రాలు ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తుందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల్లో పచ్చరొట్ట, జీలుగు, జనుము, పిల్లిపెసర తదితర విత్తనాలను రాయితీపై రైతులకు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.